# అంతా మాయ!

- ప్రతాప వెంకట సుబ్బారాయుడు



పొద్దున్నే నిద్రలేచిన కాంతం పక్కనే అర్ధనిమీలిత నేత్రాలతో కూర్చుని వున్న భర్త శేషగిరిరావుని చూసి దడుసుకుని "అలా కళ్ళు తేలేసి కూర్చునుంటే నా గుండె జారిపోదూ.. నన్ను చంపి ఈ వయసులో మరో పెళ్ళి చేసుకుందామనా ఏంటి? " అంది గదమాయిస్తూ.

"చంపడానికి నేనెవర్ని.. చావడానికి నువ్వెవరు? నాలుగురోజులు ఉండడానికి ఈ లోకంలోకి వచ్చిన చుట్టాలం మనం. అది గుర్తెరిగి ప్రవర్తించాలి" అన్నాడు నింపాదిగా.

"ఓయమ్మో! ఈయన అబ్బిరిదిబ్బిరిగా మాట్లాడుతున్నాడు. ఈయనకేమైందిరా భగవంతుడా? " అని శోకాలు తీసింది. అది విని పక్కగదుల్లో పడుకుని వున్న కొడుకు, కోడలు, పండక్కొచ్చిన కూతురు, అల్లుడూ కూడా పరిగెత్తుకుంటూ వచ్చి "ఏమైంది? " ఆందోళన ముఖాల్లో కనబరుస్తూ గాబరాగా అడిగారు.

"ఏం చెప్పమంటార్రా.. మీ నాన్నకి ఏ గాలో సోకింది. ఏంటేంటో మాట్లాడుతున్నారు" అంది మరింత గట్టిగా రాగాలు తీస్తూ.

అది విని చుట్టుపక్కలవాళ్ళు కూడా వచ్చేశారు. పక్కింటాయన "ఏమైంది శేషగిరిరావు గారు? అందరూ భయపడుతున్నారు" అన్నాడు.

"ఏవీ కాలేదు.. కాదు.. మనం పోగొట్టుకున్నది మనదగ్గరే వుంటుంది. పోయిందనుకుని గొల్లుమంటాం, అంతే" అన్నాడు శేషగిరిరావు.

"నిజంగానే అర్థంపర్థంలేని మాటలు మాట్లాడుతున్నాడీయన" ఎదురింటి పుల్లారావు ముక్తాయింపునిచ్చాడు.

అంతలో అక్కడున్న వాళ్ళలో ఒకతను ఏదో గుర్తుకొచ్చినట్టు గబగబ బయటికెళ్ళి రెండు నిముషాల్లో వచ్చి "మీరంతా అనుకుంటున్నట్టు ఆయనకేమీ కాలేదు. దైవత్వం వచ్చింది. వారం రోజుల నుండి ఒక ముఖ్యమైన వస్తువు పోగొట్టుకుని సతమతమవుతున్నాను. ఆయన అన్న మాటకి తక్కున పెట్టిన చోటు గుర్తొచ్చి వెళ్ళి చూద్దునుకదా.. భద్రంగా అక్కడే వుంది" అని ఆయన పాదాలు కళ్ళకద్దుకున్నాడు.

అంతే! అందరిలో చలనం వచ్చింది.

"దేవుడు తమ దగ్గరికి వచ్చాడు. ఏ పుట్టలో ఏ పాముందో!" అని అందరూ లెంపలు వాయించుకుంటూ సాష్టాంగ పడ్డారు శేషగిరిరావుకు.

ఒకావిడ, "మా అమ్మాయికి ఎన్నో సంబం

## చతుర కథలు

ధాలు చూశాం.. కాని ఒక్కటీ కుదిరి చావలేదు. గుండెల మీద అగ్నిపర్వతం వున్నట్టుగా అనిపిస్తుంది మాకు! దయచేసి ఏదైనా తరుణోపాయం చెప్పండి" అంది.

శేషగిరిరావు పశ్చిమంవైపు తీక్షణంగా చూశాడు. అంతే, అక్కడి గుంపు నుండి ఒకాయన "అర్థమైంది స్వామీ! వాళ్ళమ్మాయిని మా అబ్బాయికి చేసుకుంటాం. అమ్మాయి మన కళ్ళ ముందు పెరిగింది. పెద్దలంటే భయం, భక్తి వున్నాయి. మేమే కట్నంకోసం కక్కుర్తి పడి

అప్పుడు కాదన్నాం, కాదుకాదు కాలదన్నుకున్నాం. ఇప్పుడు మాకేం అభ్యంతరం లేదు. మీ ఆశీస్సులుంటే చాలు" అని చెప్తూ, అందర్నీ తప్పించుకుంటూ వచ్చి శేషగిరిరావు పాదాలపై పడ్డాడు.

"ఉన్నట్టుండి ఈయనిలా మారడమేంటి? వీళ్ళ ఫాలోయింగేమిటీ? " అని శేషగిరిరావు ఇంట్లోవాళ్ళకి విచిత్రంగా అనిపించింది.

వారంరోజుల్లో ఆ ఇంటి వాతావరణం మారిపోయింది. డబ్బుకి కొదవుండడం లేదు. ఏం కావాలన్నా క్షణంలో ముంగిట్లో వాలుతున్నాయి.

ఆరోజు సాయంత్రం తన వాళ్ళ సమక్షంలో విశ్రాంతి తీసుకుంటూ "కాంతం.." ప్రేమగా అన్నాడు శేషగిరిరావు.

"ఏమిటి స్వామీ" అంది నమ్రతగా కాంతం.

"అబ్బా! నేను చెప్పేది జాగ్రత్తగా వినండి. ఇన్నాళ్లూ ప్రైవేటు కంపెనీలో గొడ్డుచాకిరీ చేసి రిటైరయ్యాను. సాధించింది.. సంపాదించింది ఏమీ లేదు. పెన్షను కూడా లేదు. మన పిల్లలు కూడా అత్తెసరు జీవితాలు గడుపుతున్నారు. భవిష్యత్తు తలచుకుంటే అంధకారబంధురంగా అనిపించింది. అదీగాక రిటైరయినప్పటి నుండి ఏమీ తోచక చస్తున్నాను. ఈ వయసులో మరో ఉద్యోగం చేసే ఓపిక లేదు. అందుకే పాచిక వేశాను.. పారింది. భక్తుల మధ్యలో వున్నప్పుడు పాలూపళ్ళు ఎలాగూ తప్పవు. కనీసం ఏకాంతంలో విశ్రాంతి తీసుకుంటున్నప్పుడన్నా కాస్త ఆవకాయ, గోంగూరతో అన్నం పెట్టండి. మనకి రేపటి మీద బెంగలేదు. అంతా మన భక్తులు చూసుకుంటారు" అన్నాడు.

"మరి ఒకతనికి పోయింది దొరకడం.. మరొకావిడ కూతురికి సంబంధం కుదరడం.. అవన్నీ? " అడిగాడు కొడుకు.

"యాదృచ్ఛికం! కాలం కలిసొస్తే అంతే. అంతా మాయ!" అన్నాడు శేషగిరిరావు. ©

# ఉచితం

- వీరేశ్వరరావు. ఎమ్

రామారావు అనే బిజినెస్‌మాన్ ఆ రోజు హెయిర్ కటింగ్‌కోసం బాలయ్య బార్బర్ షాపుకి వెళ్ళాడు. క్షవరం చేయించుకున్నాక రామారావు డబ్బులు ఇవ్వబోతే, 'ఈవారం నేను సేవావారోత్సవం పాటిస్తున్నా! డబ్బులు వద్దు' అని బార్బర్ బాలయ్య తిరస్కరించాడు. రామారావు సంతోషించి, ధన్యవాదాలు తెలిపి వెళ్ళిపోయాడు.

మర్నాడు బాలయ్య షాపు దగ్గర రామారావు పంపిన స్వీట్ ప్యాకెట్, గ్రీటింగ్ కార్డు ఉన్నాయి.

తరువాత ఒక పోలీసువాడు బాలయ్య షాపుకి వచ్చాడు. కటింగ్ అయ్యాక డబ్బులు ఇవ్వబోతే బాలయ్య తిరస్కరించాడు. 'సేవే ధర్మం' అని చెప్పాడు. పోలీసు సంతోషించి వెళ్ళిపోయాడు.

మర్నాడు బాలయ్య షాపు దగ్గర పోలీసు పంపిన బుట్టెడు పళ్ళు ఉన్నాయి.

అదేవిధంగా ఒక ప్రొఫెసర్‌కీ జరిగింది.

ప్రొఫెసర్ సంతోషించి బార్బర్ జీవితానికి పనికివచ్చే పుస్తకాల సెట్ పంపించాడు.

నాలుగు రోజుల తర్వాత ఎమ్మెల్యే ఏడుకొండలు వచ్చాడు. హెయిర్‌కటింగ్ అయ్యాక



యాభై రూపాయలు ఇవ్వబోయాడు. ఎప్పటిలాగే బాలయ్య తిరస్కరించాడు. 'లోకం ఎంత మంచిది' అని సంతోషించి, కరచాలనం చేసి ఎమ్మెల్యే ఏడుకొండలు వెళ్ళిపోయాడు.

మర్నాడు బాలయ్య షాపు తెరిచే సమయానికి నలభైమంది కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారు, ఉచితంగా క్షవరం చేయించుకోవడానికి! ©